www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 6 ఫిబ్రవరి 2024

5

పశ్చిమ గోదావరి

'స్పందన'కు 29 ఫిర్యాదులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై జిల్లా నలుమూల నుండి మొత్తం 29 ఫిర్యాదులు అందాయని జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల తెలిపారు. ఫిర్యాదులను ఎస్‌పి స్వయంగా స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను ఆయా పోలీస్ స్టేషన్లకు పంపి సత్వరమే విచారణ చేపట్టి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి భీమారావు, ఎస్‌బి సిఐ తిలక్, వన్‌టౌన్ సిఐ అడబాల శ్రీను పాల్గొన్నారు.

పోలవరం, చింతలపూడి

పూర్తి చేస్తాం..

- పామాయిల్, ఆక్వా రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తాం
- మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తాం
- జిల్లాలో వైసిపి ఎంఎల్‌ఎల అవినీతిపై తీవ్ర విమర్శలు
- 64 రోజులు కష్టపడితే టిడిపి, జనసేన ప్రభుత్వమే
- చింతలపూడి 'రా.. కదలిరా' సభలో టిడిపి అధినేత చంద్రబాబు
- హెలీప్యాడ్ వద్ద బజర్ సౌండ్‌తో కొద్దిసేపు కలకలం
- భారీగా జన సమీకరణతో టిడిపి నేతల్లో ఉత్సాహం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, చింతలపూడి

టిడిపి అధికారంలోకొచ్చాక పోలవరం, చింతలపూడి ఎత్తిపోతల పథకం సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ సిఎం చంద్రబాబునాయుడు తెలిపారు. శనివారం చింతలపూడిలోని ఆంథోని నగర్‌లో 'రా.. కదలిరా' సభ నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నిర్దేశిత సమయం 3.30 గంటలకు చంద్రబాబు హెలీకాప్టర్‌లో హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. ఆయనకు టిడిపి నాయకులు ఘనస్వాగతం పలికారు. నాలుగు గంటలకు సభా వేదికపైకి చంద్రబాబు చేరుకోగానే టిడిపి, జనసేన నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించారు. చంద్రబాబు రాకముందు చింతలపూడి టిక్కెట్ ఆశిస్తున్న సొంగా రోషన్‌కుమార్, బొమ్మాజీ అనిల్, ఆకుమర్తి రామారావుతోపాటు ఏలూరు ఇన్‌ఛార్జి బడేటి చంటి, మాజీ మంత్రి ప్రతిపాటి పుల్లారావు, జనసేన నాయకులు కొటికలపూడి గోవిందరావు, రెడ్డి అప్పలనాయుడు, మేకా ఈశ్వరయ్య, ఇతర నాయకులు ప్రసంగించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ గతంలో చింతలపూడిలో అనేక సభలు నిర్వహించినప్పటికీ ఇప్పుడు చింతలపూడి జనప్రభంజనంగా మారిందన్నారు. 64 రోజులు కష్టపడితే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయన్నారు. ఆడబిడ్డలు, తోబుట్టువులు అండగా ఉంటే ఎవరినైనా జయిస్తానన్నారు. ఈ గెలుపు నా కోసం కాదని, చితికిపోయిన రాష్ట్రం కోసమన్నారు. జగన్ పాలనలో ప్రజలెవ్వరూ ఆనందంగా లేరన్నారు. రూ.12 లక్షల కోట్లు అప్పుచేసి వ్యవస్థలను భ్రష్టు పట్టించాడన్నారు. నాసిరకం మద్యంతో ఎంతోమంది చనిపోయారన్నారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలు టిడిపి హయాంలో ఎంతున్నాయి, ఇప్పుడు ఎంత పెరిగాయనేది వివరించారు. ఉచితంగా ఇచ్చే ఇసుకను ట్రాక్టర్ రూ.ఐదు వేలు చేశారన్నారు.

సభకు హాజరైన జనం

ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

పోలవరం రాష్ట్రానికి వరం అని, 72 శాతం పూర్తి చేశామన్నారు. పట్టిసీమ ఏడాదిలో పూర్తిచేసి 124 టిఎంసిల నీటిని కృష్ణాకు తరలించామని తెలిపారు. పోలవరం డయాఫ్రం వాల్, కాపర్ డ్యామ్, గైడ్‌బండ్ ఏమైందో తెలియదని, ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. చింతలపూడి పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామన్నారు. రైతులు వాణిజ్య పంటలు వేసుకోవచ్చునన్నారు. పామాయిల్‌కు సబ్సిడీలు ఇచ్చేవారమని, ఇప్పుడు అవి లేకుండా పోయాయన్నారు. టన్ను ధర రూ.18 వేల నుంచి రూ.12 వేలకు పడిపోయిందన్నారు. ఆక్వాకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందిస్తామన్నారు. సూపర్ సిక్స్ కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. మొదటి తేదీనే పెన్షన్ ఇంటిదగ్గర ఇస్తామని, మూడు నెలలు తీసుకోకపోయినా ఒకేసారి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. జగన్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు.

వైసిపి ఎంఎల్‌ఎలపై తీవ్ర విమర్శలు

ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ తెలివైన వాడని, ఎన్నికల నుంచి తప్పించుకున్నారని, ఐదేళ్లలో చేసిందేమీ లేదని అన్నారు. మంత్రి కొడుకుని ఇక్కడకు తీసుకొచ్చారని, రైతుకు గోనెసంచులు ఇవ్వలేని వాడు, పార్లమెంట్‌కు పోటీకి తన కొడుకును దింపుతారా అంటూ ఎద్దేవా చేశారు. చింతలపూడి ఎలిజాకు గ్రాఫ్ లేదని చీటీ చిరిగిపోయిందన్నారు. నా గ్రాఫ్ కాదు..మీ గ్రాఫ్ పడిపోయిందని జగన్‌ను ఆయన అన్నారన్నారు. మిథున్‌రెడ్డి పెద్దిరెడ్డి కొడుకని, ఇక్కడ అతని పెత్తనం ఏమిటన్నారు. ఎలిజా మాట్లాడినట్లు సామాజిక న్యాయం లేదని, ఎస్‌సిలపై చిన్నచూపు ఉందన్నారు. వాసుబాబు వసూళ్లరాజు అంటూ విమర్శించారు. చేపల చెరువులు, పోలవరం కుడికాలువ మట్టిని సైతం తినేశారన్నారు. కాలువ గట్లు కొట్టుకుపోయే పరిస్థితి వచ్చిందన్నారు. దెందులూరు ఎంఎల్‌ఎ అబ్బాయిచౌదరి అక్రమార్కులకే అక్రమార్కుడన్నారు. రౌడీషీటర్లతో ములాఖాత్ అయి ముందుకెళ్తున్నాడన్నారు. చింతమనేనిపై పెట్టని కేసు లేదన్నారు. తెల్లం బాలరాజు గిరిజనుల డబ్బు కొట్టేశాడన్నారు. ఎదురు తిరిగిన వారిపై అట్రాసిటీ కేసులు పెట్టించారన్నారు. వీళ్లు గిరిజనులను రక్షిస్తారా అన్నారు. మేకా అప్పారావు కొడుకు నూజివీడుకు గుండుకొట్టించాడని తెలిపారు. ఆళ్ల నాని ఏం చేశాడో ఆయనకే తెలీదన్నారు. దూలం నాగేశ్వరరావు కొడుకు చేపల చెరువుల్లో, సెంటు పట్టా భూముల్లో రూ.300 కోట్లు దోచుకున్నారన్నారు. చింతలపూడి, పోలవరం పూర్తి చేయడంతోపాటు, మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, మాజీ మంత్రులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. సభ పూర్తయిన తర్వాత ట్రాఫిక్ నిలిచిపోవడంతో సభకు వచ్చినవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

హెలీప్యాడ్ వద్ద బాంబు కలకలం

చంద్రబాబు దిగబోయే హెలీప్యాడ్ వద్ద బాంబు స్క్వాడ్ తనిఖీల్లో బజర్ మోగడంతో కొద్దిసేపు కలకలం నెలకొంది. వెంటనే ఆ ప్రాంతంలో తవ్వగా ఇనుప ముక్క బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇతర వస్తువులు ఏమీ లేవని బాంబ్ స్క్వాడ్ సిబ్బంది నిర్ధారణకు వచ్చారు.

ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

స్పందన సమస్యలు సకాలంలో పరిష్కరించాలి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

'స్పందన' ద్వారా వచ్చే సమస్యలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, హౌసింగ్ పీడీ డాక్టర్ ఆర్‌సి.ఆనందకుమార్, డిఎస్‌పి బి.శ్రీనాథ్‌తో కలిసి కలెక్టర్ 235 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పక పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేట్ ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - భీమవరం

విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు గత ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాన్ని ప్రభుత్వం నిలబెట్టుకుని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. జిల్లా కలెక్టరేట్లో సోమవారం అధికారులకు వినతిపత్రం అందజేసి సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు బర్రె రాము, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సురేష్ మాట్లాడారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. పర్మినెంట్ కార్మికులతో సమానమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ ఈ కాలంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు ఆందోళన బాట పట్టారని అన్నారు. తక్షణం వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ ఆందోళనకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలిపిందన్నారు. కార్యక్రమంలో తిరుపతి, పవన్ కళ్యాణ్, జెస్సి పాల్ పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి అవుతానని ఊహించలేదు

వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థి ఉమాబాల

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎన్నో ఏళ్ల నుంచి రాజకీయాల్లో ఉన్నానని, తాను నామినేటెడ్ పదవిని ఆశించానని, ఎంపీ అభ్యర్థిని అవుతానని ఊహించలేదని వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరు ఉమాబాల అన్నారు. పాలకోడేరులో ఏర్పాటుచేసిన వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత కార్యక్రమానికి విచ్చేసిన ఉమాబాలను డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు ప్రజలకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఉమాబాల మాట్లాడారు. నరసాపురం పార్లమెంట్ స్థానాన్ని పూర్వం నుంచి రాజకీయ పార్టీలు అగ్రవర్ణాలు, ఆర్థికంగా ఉన్నవారికి, పారిశ్రామికవేత్తలకు కేటాయిస్తూ వస్తున్నారని తెలిపారు. అయితే ముఖ్యమంత్రి జగన్ సామాన్య వ్యక్తినైనా తనను నియమించడం పట్ల మహిళలు, వెనకబడిన కులాలకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో ఆలోచన చేయాలన్నారు. ఎన్నికల సమయం ఆసన్నమైందని ఇప్పటివరకు పార్టీలో ఉన్న టిక్కెట్టు ఆశించి అర్హత ఉన్నవారు అనేక మంది ఉన్నారని ఈ నేపథ్యంలో కొన్ని ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డ కలిసి ముందుకు సాగాలన్నారు. అన్ని వర్గాల వారికి వైసిపి ప్రభుత్వం న్యాయం చేసిందని, రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. నిస్వార్థపరుడు నరసింహరాజును, తనను ఎన్నికల్లో గెలిపించాలన్నారు.

మాట్లాడుతున్న పివిఎల్ నరసింహరాజు, పక్కనే ఉమాబాల

పాలకొల్లు : రాష్ట్రంలో జగన్‌ను ఓడించాలనే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఏకమై కుట్ర పన్నుతున్నారని, జగన్‌ను తిరిగి సిఎంను చేయాలని నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల కోరారు. పాలకొల్లు వైసిపి కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల ఆత్మీయ సమ్మేళనానికి గుడాల గోపి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ డిసిఎంస్ ఛైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణాధ్యక్షులు చందక సత్తిబాబు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి : ఆర్‌డిఒ

నరసాపురం: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆర్‌డిఒ ఎం.ఎ.అంబరీష్ అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో 32 ఫిర్యాదులు వచ్చాయన్నారు. మండలంలోని సాగునీటి కాలువలు గుర్రపు డెక్క, చెత్తతో పూడుకుపోయి పొలాలకు సాగునీరు అందడం లేదని రైతులు వాతాడి ఉమ, పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నరసాపురం ఎన్‌టిఆర్ కాలనీకి చెందిన బి.రత్నకుమారి వైఎస్ఆర్ చేయూత రావడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - పెంటపాడు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం టి.రామకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కసిరెడ్డి అచ్చమ్మ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, నాయకులు బంకురు నాగేశ్వరరావు మాట్లాడుతూ నాడు ప్రతిపక్ష నేతగా జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా మధ్యాహ్నం భోజన కార్మికులకు తాను అధికారంలోకి రాగానే రూ.పది వేలకు తగ్గకుండా వేతనం పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వ పదవీకాలం పూర్తవుతున్నా నేటికీ ఆ హామీ అమలుకు నోచుకోలేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇతర డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పెనగంటి దుర్గా, చుక్కల మాధవ, కునిరెడ్డి శివరంజని, రెడ్డి ముత్యం, జామి రామలక్ష్మి, బోడబల్ల కాశమ్మ, సీత, దయామణి, విమల, రాఘవమ్మ, మమత పాల్గొన్నారు.

తణుకులో ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, నేతలు

పెంటపాడులో..

తాడేపల్లిగూడెం: మధ్యాహ్న భోజన కార్మికులు స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్.రంగారావు, కండెల్లి సోమరాజు మాట్లాడారు. తక్షణమే సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని వారు పభుత్వాన్ని డిమాండ్ చేశారు. మిడ్‌డే మీల్స్ సంఘం మండల నాయకులు మద్దూరు గంగారత్నం, తుంగ లక్ష్మి మాట్లాడారు. అనంతరం ఎంఇఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కండెల్లి కుమారి, జి.దుర్గాదేవి, కట్టుపోయిన వెంకమ్మ, తాతకుంట్ల సత్యవతి, పి.చంటి, పల్లి కవిత, అడపా కనకదుర్గ, వై.గోపమ్మ, కర్రి చిట్టెమ్మ పాల్గొన్నారు.

తణుకురూరల్: మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు అడ్డగర్ల అజయకుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులు సిఐటియు ఆధ్వర్యాన స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. అజయకుమారి మాట్లాడుతూ ఉపాధి భద్రతతోపాటు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.రామసత్యవతి, ఎ.నాగదేవికుమారి, జె.రాజేశ్వరి, పి.మహాలక్ష్మీ, ఎం.లక్ష్మీ, ఎం.భాగ్యలక్ష్మీ, పి.సుబ్బలక్ష్మీ, ఎస్.సావిత్రి, సిహెచ్.ప్రశాంతి పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద విభిన్న ప్రతిభావంతుల ధర్నా

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విభిన్న ప్రతిభావంతుల సమస్యలను పరిష్కరించి వారికి ఉన్న హక్కుల చట్టం-2016ను కట్టుదిట్టంగా అమలు చేయాలని విభిన్న ప్రతిభావంతుల సంఘం జిల్లా కార్యదర్శి అల్లాడి నటరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద సంఘం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించి డిఆర్‌డిఎ పీడీ శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నటరాజ్ మాట్లాడుతూ బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ చేపట్టాలని, కనీస పెన్షన్ రూ.ఆరు వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాంకు రుణాల మంజూరు ద్వారా చేతివృత్తులు స్వయం ఉపాధి కల్పించుకునే దానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ప్రతి కుటుంబానికీ 35 కిలోల రైస్‌కార్డు, ఇంటి స్థలం ఇచ్చి భవనం నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వివాహ ప్రోత్సాహం, త్రీ వీలర్స్ పొందడానికి ఉన్న నిబంధనలను సడలించి అందరికీ అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మద్దాల శ్రీనివాసరావు, మేడపాటి వీరవెంకట రాఘవేంద్రరెడ్డి, చింతాడ పద్మావతి, కెవి.రామ్మూర్తి, చింతపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డిఆర్‌డిఎ పీడీ శివప్రసాద్‌కు వినతిపత్రం వికలాంగులు

పాత పెన్షన్ పునరుద్ధరించిన వారికే మా ఓటు

ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పోడూరు

ఓట్ ఫర్ ఒపిఎస్ పేరుతో యుటిఎఫ్ పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం ఉద్యమ కార్యాచరణలో భాగంగా యుటిఎఫ్ మండల కార్యకర్తలు ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి.రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా ఎన్నికైన వారం రోజుల్లో పాత పెన్షన్ పునరుద్ధరిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చి ఐదు సంవత్సరాలు గడిచిన ఇచ్చిన హామీని నెరవేర్చలేదని, నాలుగున్నర సంవత్సరాలుగా తాము చేసిన అనేక పోరాటాలను ఉక్కుపాదంతో అణిచివేశారని తెలిపారు. ఎన్నికల కాలం కాబట్టి ఒపిఎస్ ఇచ్చిన వారికే మా ఓట్లు అంటూ ఓట్ ఫర్ ఓపిఎస్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ద్వారా, పోస్ట్ కార్డు ఉద్యమం ద్వారా తమ వాణి వినిపిస్తామని తెలిపారు. స్పష్టమైన హామీ ఇచ్చిన వారికే తమ ఓటు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు, బి.శేషగిరిరావు, సిహెచ్.త్రినాథ్, ఎంపి.రావు, సిహెచ్.కరుణకుమారి పాల్గొన్నారు.

పోడూరులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

నరసాపురం : ఓట్ ఫర్ ఒపిఎస్ పేరుతో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పాత పెన్షన్ కోసం ఉద్యమ కార్యాచరణ ప్రకటించింది. దీనిలోభాగంగా స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం.మార్కండేయులు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ పునరుద్ధించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.కృష్ణ కుమారి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి.శ్రీనివాసు, జిఎస్ఎస్ఆర్ స్వామి, నాయకులు పి.శాంసన్, ఎస్.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

తహశీల్దార్ల బాధ్యతలు స్వీకరణ

భీమవరం తహశీల్దార్‌గా శివకుమార్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం తహశీల్దార్‌గా ఎల్.శివకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా కాకినాడ జిల్లా తునిలో తహశీల్దారుగా పనిచేసిన ఆయన భీమవరం వచ్చినట్లు తెలిపారు. ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

కాళ్ల తహశీల్దార్‌గా శ్రీదేవి

కాళ్ల : కాళ్ల తహశీల్దార్‌గా ఎస్.శ్రీదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో రామచంద్రపురం ఆర్‌డిఒ కార్యాలయంలో డిఎఒగా పనిచేశారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో బాధ్యతాయుతంగా పని చేస్తానని తెలిపారు. రైతులకు, విద్యార్థులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్నివిధాలా సహకరిస్తానని తెలిపారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ కిరణ్, విఆర్‌ఒ, విఆర్‌ఎలు, చౌక డిపో డీలర్లు స్వాగతం పలికారు.

ఉండి తహశీల్దార్‌గా శ్రీనివాస్

ఉండి : ఉండి మండల తహశీల్దార్‌గా కొమ్మూరి శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇప్పటివరకూ ఇక్కడ తహశీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన ఏడిద శ్రీనివాస్ కృష్ణాజిల్లా గుడ్లవల్లేరుకు బదిలీ అయ్యారు. కృష్ణా జిల్లా ముదినేపల్లి తహశీల్దార్‌గా పనిచేసిన కొమ్మూరి శ్రీనివాస్ ఉండి తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డిప్యూటీ తహశీల్దార్ ఎస్.వీరాస్వామి నాయుడు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్, మండల సర్వేయర్ రత్నావళి, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం మండల అధ్యక్షులు ఎస్ చిన్నారావు, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు పిల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు నూతన తహసిల్దార్ కొమ్మూరి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ సహచర అధికారుల సమన్వయంతో మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

నరసాపురం తహశీల్దార్‌గా ప్రసాద్

నరసాపురం : నరసాపురం తహశీల్దార్‌గా ఎన్ఎన్ఎన్.ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అల్లవరం నుంచి బదిలీపై ఇక్కడకి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. గతంలో ఇక్కడ పని చేసిన తహశీల్దార్ సయ్యద్ మౌలానా పాజిల్ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కెఆర్‌పురం తహశీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

గణపవరం తహశీల్దార్‌గా రాంబాబు

గణపవరం : గణపవరం తహశీల్దార్‌గా వై.రాంబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాంబాబు తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం నుంచి గణపవరం బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ తహశీల్దార్‌గా ఉన్న మమ్మీ లక్ష్మి మచిలీపట్నం బదిలీపై వెళ్లారు. నూతన తహశీల్దార్ రాంబాబుకు రెవెన్యూ సిబ్బంది, డీలర్లు ఆహ్వానం పలికారు.

ఆచంట తహశీల్దార్‌గా శెట్టి

ఆచంట: ఆచంట తహశీల్దార్‌గా ఐపి శెట్టి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన సుబ్రహ్మణ్యం కోనసీమ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శెట్టి మాట్లాడుతూ ఎన్నికల నిబంధన ప్రకారం అంకితభావంతో పనిచేసి అందరి మన్నలు పొందుతానన్నారు. ఈ సందర్భంగా విఆర్‌ఒల సంఘం మండల అధ్యక్షులు మిరియాల శేషగిరిరావుతో పాటు డిటి.సంధ్య, ఆర్ఐ జయలలిత, విఆర్‌ఒలు తహశీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కెఆర్‌ఆర్‌సి తహశీల్దార్‌గా రామకృష్ణ



నరసాపురం: నరసాపురం ఆర్‌డిఒ కార్యాలయంలో కెఆర్‌ఆర్‌సి తహశీల్దార్‌గా ఎల్‌విఎస్.రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటివరకూ కృష్ణా జిల్లాలోని అవనిగడ్డ తహశీల్దార్‌గా పని చేశారు. బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణ ఆర్‌డిఒ ఎం.ఎ.అంబరీష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామకృష్ణను ఆర్‌డిఒ కార్యాలయ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

తాడేపల్లిగూడెం తహశీల్దార్‌గా మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం తహశీల్దార్‌గా బి.మురళీకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కృష్ణాజిల్లా కైకలూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది, విఆర్‌ఒలు శుభాకాంక్షలు తెలిపారు.

పోడూరు తహశీల్దార్‌గా మురళీకృష్ణ

పోడూరు : పోడూరు తహశీల్దార్‌గా బిబివి.మురళీకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అమలాపురం ఆర్‌డిఒ కార్యాలయ ఎఒగా బాధ్యతలు నిర్వహించి బదిలీపై పోడూరు వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన ఆర్‌వి.కృష్ణారావు అంబేద్కర్ కోనసీమ జిల్లాకు బదిలీపై వెళ్లారు. తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన బిబివి.మురళీకృష్ణను ఆర్ఐ కె.రాంబాబు, డిటి టి.రాజేష్, సీనియర్ అసిస్టెంట్ త్రిమూర్తులు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పాలకొల్లు తహశీల్దార్‌గా మధుసూదన్‌రావు

పాలకొల్లు రూరల్: పాలకొల్లు తహశీల్దార్‌గా మధుసూదన్‌రావు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు నుంచి బదిలీపై వచ్చారు. రాంబాబుకు రెవెన్యూ సిబ్బంది, డీలర్లు ఆహ్వానం పలికారు.

పాలకోడేరు తహశీల్దార్‌గా నాగార్జున

పాలకోడేరు : పాలకోడేరు తహశీల్దార్‌గా కె.నాగార్జున సోమవారం బాధ్యతలు చేపట్టారు. నరసాపురం సభ కలెక్టర్ కార్యాలయంలో ఎఒగా పనిచేస్తున్న నాగార్జున ఎన్నికల బదిలీలో భాగంగా ఇక్కడికి వచ్చాడు. గతంలో ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన షేక్ హుస్సేన్ పి.గన్నవరం తహశీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. నూతన తహశీల్దార్ నాగర్జునను డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణ రాజు, ఆర్ఐ నాగభూషణం నాయుడు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

పెనుగొండ తహశీల్దార్‌గా రమణాదేవి

పెనుగొండ : పెనుగొండ తహశీల్దార్‌గా ఆర్‌వివి. రమణాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ కృష్ణాజిల్లా బదిలీ అయ్యారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

వైసిపి ప్రభుత్వానికి మహిళలు అండగా నిలవాలి

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

మహిళలకు మాన్యువల్ చెక్కును అందిస్తున్న పివిఎల్

వైసిపి ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేశారని, రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి మహిళలంతా అండగా నిలవాలని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు కోరారు. పాలకోడేరులో వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమాన్ని పివిఎల్ నరసింహరాజు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు) నేతృత్వంలో భారీ జన సమీకరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పివిఎల్ మాట్లాడారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు లేనిపోని హామీలిచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి జగన్ నెరవేర్చారని చెప్పారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి మధ్య తేడా గమనించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని మళ్లీ నిలబెట్టాలన్నారు. ఎంఎల్‌సి కౌరు శ్రీనివాస్, నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల , ఉండి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు పిళ్ళాం గొల్ల శ్రీలక్ష్మి మాట్లాడారు. గతంలో చంద్రబాబు మహిళలను మోసం చేసి వారిపట్ల నిరంకుశంగా వ్యవహరించారన్నారు. టిడిపి, జనసేన కల్లబొల్లి కబుర్లు, మతిలేని పార్టీలో గతిలేక చేరిన షర్మిల చెబుతున్నవేమీ నమ్మొద్దని తెలిపారు. అనంతరం నాలుగో విడత ఆసరాకు సంబంధించి 12,946 డ్వాక్రా సభ్యులకు రూ.13,24,67,284 మాన్యువల్ చెక్కును అందజేసి, జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు), జెడ్‌పిటిసి పెద్దిశెట్టి లక్ష్మీతులసి సుబ్రహ్మణ్యం, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూపతి రాజు వంశీకృష్ణంరాజు, బొల్లా శ్రీనివాస్, ఉండి ఎఎంసి వైస్ ఛైర్మన్ చేకూరి రాజా నరేంద్ర కుమార్ (నరేంద్ర రాజు), ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజలు ఇంటినే కాకుండా పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్.కృష్ణచైతన్య అన్నారు. పెదఅమిరంలో ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా సోమవారం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వీధుల్లో తిరిగి ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త సేకరణ నిర్వహించారు. ప్లాస్టిక్ వల్ల ప్రాణాంతకమైన కేన్సర్ వంటి వ్యాధులు కూడా వస్తున్నాయని, వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వాలంటీర్లతోపాటు ఎన్ఎస్-ఎస్ సహాయ కోఆర్డినేటర్ కెఎన్‌వి సత్యనారాయణ, నాగవల్లి, వెంకట్రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాధరాజు అన్నారు. తూర్పు పాలెం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏడో రోజు మనసారా ఆసరా సంబరాల్లో ఆయన మాట్లాడారు. ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ మేడపాటి షర్మిలా రెడ్డి, నియోజకవర్గ వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

కాశిపాడులో పిప్పర పిహెచ్‌సి ఆధ్వర్యాన కుష్టు వ్యాధిపై స్థానికులకు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పారా మెడికల్ అధికారి పి.రమేష్ మాట్లాడుతూ శరీరంపై స్పర్శలేని మచ్చలు, నరాల తిమ్మిర్లు, కనుబొమ్మలు మూతపడకపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే స్థానిక వైద్య సిబ్బందికి తెలపాలని చెప్పారు స్థానిక ఆసుపత్రిలో ఆరు నెలలపాటు ఎండిటి చికిత్స చేయించుకుంటే నివారించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పిఎంపి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె పరమేశ్వర రావు, తెర్లి కృష్ణారావు రోగులకు పండ్లు, వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ పర్సన్ నామాల రాజు, ఎఎన్ఎం శివకుమారి వసంత పాల్గొన్నారు.

సమ్మె కార్మికుల్లో ఐక్యతను పెంచింది

ప్రజాశక్తి - తణుకు రూరల్

సమ్మె కార్మికుల్లో ఐక్యతను పెంచిందని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. సోమవారం అమరవీరుల భవనంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సర్వసభ్య సమావేశం అచ్చి కృష్ణబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు రాష్ట్రంలో 16 రోజులు సమ్మె చేశారని, సమ్మెలో అందరూ ఐక్యంగా తమ హక్కులను సాధించుకోవడం కోసం పోరాడారన్నారు. పోరాట ఫలితాలు అందరికీ సమానంగా ఉంటాయన్నారు. పాలకులు, కార్మికుల పక్షాన పనిచేస్తే వారి సమస్యలు పరిష్కారం అవుతాయని, అలా కాకుండా పాలకులు ప్రయోజనం కోసమే పరిపాలిస్తే కార్మికులకు నష్టం జరుగుతుందని తెలిపారు. కామన మునిస్వామి మాట్లాడుతూ కార్మిక చట్టాల అమల్లో ప్రభుత్వాలు అలసత్వం వహిస్తే కార్మికులకు పోరాటమే ఆయుధం అన్నారు. ఇఎస్ఐ జమ చేయాలని, ఆరోగ్య భద్రత కల్పించాలని, పనిముట్లు సకాలంలో ఇవ్వాలని, ప్రభుత్వ జిఒల ప్రకారం సెలవులు అమలు చేయాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు నీలాపు ఆదినారాయణ బాబు, ఎం.నాగేంద్ర, టి.సుధాకర్, పాల్గొన్నారు.

సుస్థిర పాలనకు ఓటు ఒక్కటే మార్గం

ఎస్‌పి అజిత వేజెండ్ల

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సుస్థిర పాలనకు ఓటు ఒక్కటే మార్గమని, నైతిక విలువలతో ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల తెలిపారు. సోమవారం భీమవరం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్లో శ్రీవిజ్ఞానవేదిక, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఓటు హక్కు ఆవశ్యకత విలువ అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా సంక్రమించిన ఓటును సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రజాస్వామ్య పరిరక్షణ జరుగుతుందన్నారు. ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఓటును ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా వేసుకోవాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఓటర్ ప్రతిజ్ఞ నిర్వహించి నెల రోజులుగా అన్ని చోట్లా అవగాహనా సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో లయన్స్ జోన్ ఛైర్మన్ నందమూరి రాజేష్, ఎఎస్‌పి భీమారావు, సిఐ ఎ.శ్రీనివాస్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొలువుదీరిన ఎంపిడిఒలు

భీమవరం ఎంపిడిఒగా వెంకట రమన్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఎంపిడిఒగా డికెఎస్ఎస్ వెంకటరమన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. తూర్పుగోదావరి గండేపల్లి ఎంపిడిఒగా పనిచేసిన ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా భీమవరం వచ్చారు. ఇక్కడ ఎంపిడిఒగా పనిచేసిన కె.వెంకటలక్ష్మి రాయవరం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వెంకట రమన్ మాట్లాడారు. గ్రామాల్లోని ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

ఆకివీడు ఎండిఒగా రామకృష్ణ

ఆకివీడు : ఆకివీడు ఎండిఒ వాణికి కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో తూర్పుగోదావరి జిల్లా నుంచి వచ్చిన యద్ధనపూడి రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు.

పాలకొల్లు ఎండిఒగా అనుపమ

పాలకొల్లు రూరల్: పాలకొల్లు ఎంపిడిఒగా మట్టపర్తి అనుపమ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం నుండి బదిలీపై పాలకొల్లులో విధుల్లో చేరారు.

తాడేపల్లిగూడెం ఎంపిడిఒగా శర్మ

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం ఎంపిడిఒగా ఎస్ఎస్.శర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కాకినాడ జిల్లా కోటనందూరు నుంచి బదిలీపై ఇక్కడకు విచ్చేశారు. ఇక్కడ పనిచేసిన ఎంపిడిఒ విశ్వనాథ్ ఎన్‌టిఆర్ జిల్లా నందిగామకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు ముప్పిడి సంపత్ కుమార్ నూతన ఎంపిడిఒకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి టి.వెంకటేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం సబ్ రిజిస్ట్రార్‌గా నందీశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం సబ్ రిజిస్ట్రార్‌గా జి.నందీశ్వరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న వెంకటేశ్వరరావు రిటైర్డ్ అయ్యారు. దీంతో ఏలూరు జిల్లా మండవల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న నందీశ్వరరావు బదిలీపై భీమవరం వచ్చారు.

ఉండి నియోజకవర్గ ప్రత్యేకాధికారిగా విక్టర్

ప్రజాశక్తి - ఉండి

ఉండి నియోజకవర్గ ప్రత్యేకాధికారిగా ఆర్.విక్టర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం ఉండి మండల పరిషత్ కార్యాలయానికి విధుల నిమిత్తం రాగా ఆయనకు ఎంపిడిఒ ఎస్.రవీందర్ ఆధ్వర్యంలో పలువురు అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లా పంచాయతీ అధికారి, ఉండి నియోజకవర్గ ప్రత్యేక అధికారి జివికె.మల్లికార్జునరావు ఎన్నికల విధుల్లో భాగంగా పి గన్నవరం డ్వామా విభాగానికి బదిలీ కాగా అమలాపురం డ్వామా విభాగంలో ఎఒగా పనిచేస్తున్న తాను పశ్చిమగోదావరి జిల్లా పంచాయతీ అధికారిగా బదిలీపై వచ్చినట్లు తెలిపారు. అనంతరం బదిలీ అయిన మల్లికార్జునరావును సత్కరించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి ఎ.కొండలరావు, డిప్యూటీ తహశీల్దార్ ఎస్.వీరాస్వామి నాయుడు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

తహశీల్దార్‌ను కోరిన ఇళ్ల స్థలాల లబ్ధిదారులు

ప్రజాశక్తి - ఉండి

అర్హులైన తమకు ఇళ్ల స్థలాల పట్టాలిచ్చి న్యాయం చేయాలని ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ ఇళ్ల స్థలాల లబ్ధిదారులు తహశీల్దార్ కొమ్మూరి శ్రీనివాస్‌ను కోరారు. సోమవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ కొమ్మూరి శ్రీనివాస్‌తో లబ్ధిదారులు మాట్లాడారు. తమకు ఉండి పాల శీతల కేంద్రం స్థలాన్ని మొదట్లో కేటాయించారని, తర్వాత కాలంలో వాటిని నిలుపుదల చేసి నివాసయోగ్యం కానీ, కనీస సౌకర్యాలు లేని ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇస్తామని అప్పటి తహశీల్దార్ ఆకుల కృష్ణజ్యోతి చెప్పారని తెలిపారు. తాము వ్యతిరేకించి జిల్లా కలెక్టర్, మంత్రుల దృష్టికి సమస్యను తీసుకెళ్లామని, తమ ప్రాంతంలోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించారని చెప్పారు. తర్వాత కాలంలో నివాసయోగ్యం కానీ స్థలాలను తమకు కట్టబెట్టారని తెలిపారు. తమకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల ప్రకారం ఇళ్ల స్థలాలను కేటాయించి పట్టాలను రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. దీనిపై తహశీల్దార్ కొమ్మూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సంఘటనపై తనకు ఎటువంటి అవగాహన లేదని, త్వరలోనే లబ్ధిదారులకు న్యాయం చేకూరుస్తానని హామీ ఇచ్చారు.

టిడిపి హయాంలోనే రామరాజ్యం

మాజీ ఎంఎల్ఎ శివ రామరాజు

ప్రజాశక్తి - ఉండి

టిడిపి హయాంలోనే రామరాజ్యం సాధ్యమని ఉండి మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నేడు జరుగుతున్న చంద్రబాబు నాయుడు రా కదలిరా బహిరంగ సభకు ప్రజలు స్వచ్ఛందంగా వేలాదిమంది పాల్గొనడం విశేషమన్నారు. వైసిపి పాలనపై ప్రజలు విసుగు చెంది, చంద్రబాబు పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. రానున్న 2024 ఎన్నికల్లో జనసేన, తెలుగుదేశం పార్టీ కూటమి అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, తోట ఫణి, పొత్తూరి ఫణిరాజు, మోపిదేవి నాగ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జిన్నూరు సొసైటీ ఛైర్మన్‌గా అప్పాజీ

అప్పాజీ

పోడూరు: జిన్నూరు సొసైటీ ఛైర్మన్‌గా జక్కంశెట్టి అప్పాజీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మొన్నటి వరకూ సొసైటీ ఛైర్మన్‌గా ఉన్న డిటిడిసి బాబు పాలకొల్లు ఎఎంసి వైస్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. దీంతో ఆయన సొసైటీ ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. నూతనంగా ఎన్నికైన అప్పాజీ మాట్లాడుతూ పాలకొల్లు వైసిపి ఇన్‌ఛార్జి గుడాల గోపీకి కృతజ్ఞతలు తెలిపారు. అప్పాజీకి గ్రామ సర్పంచి జమ్ము బేబీ మహాలక్ష్మి, ఎఎంసి వైస్ ఛైర్మన్ డిటిడిసి బాబు అభినందనలు తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు

ఉండి: వివాహిత అదృశ్యంపై కేసు నమోదైన ఘటన ఉండి మండలం మహదేవపట్నంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహదేవపట్నం గ్రామానికి చెందిన కన్నెపాముల సామ్యూల్ తన కుమార్తె మరియమ్మకు కైకలూరుకు చెందిన దిద్దే నానితో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. భార్యాభర్తలు తరచూ గొడవలు పడడంతో మరియమ్మ తన ఇద్దరు బిడ్డలతో పుట్టింటికి వచ్చింది. తండ్రి ఆమెను మందలించి భర్త దగ్గరకు తీసుకెళ్తానని చెప్పడంతో ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి ఇద్దరు పిల్లలను వెళ్లిపోయింది. ఎంత వెతికినా మరియమ్మ ఆచూకీ తెలియలేదని తండ్రి శామ్యూల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మందపల్లి లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజా సంక్షేమానికి గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - కాళ్ల



లబ్ధిదారునికి బ్రోచర్ అందజేస్తున్న పివిఎల్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలనే సంకల్పంతోనే సిఎం జగన్మోహన్ రెడ్డి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్. నరసింహరాజు పేర్కొన్నారు. పెదఅమిరం గ్రామ పరిధిలో సచివాలయం-2లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరాజు వైసిపి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, కరపత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడారు. అవినీతి రహిత పాలన అందించడమే కాకుండా, అందరికీ తోడు నీడగా నిలుస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి బాసటగా నిలవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, ఉప సర్పంచి జవ్వాది కిషోర్, వైసిపి నాయకులు ముకేష్ పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

ప్రజాశక్తి - నరసాపురం

జనసేన సిద్ధాంతాలు, పవన్‌కళ్యాణ్ ఆశయాలు, బొమ్మిడి నాయకర్ నాయకత్వానికి ఆకర్షితులై లక్ష్మణేశ్వరం గ్రామం నక్కావారిపేటకు చెందిన 20 మంది జనసేనలో చేరారు. ముప్పిరి నాగ మల్లేశ్వరరావు, పల్లికొండ వెంకటేశ్వరరావు, బీర రవి, తానేటి సురేష్ తదితర 20 మంది నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. ఈ కార్యక్రమంలో కె.వెంకటేశ్వరరావు, ఎన్.తారకరామారావు, తోట.నాని, అందే దొరబాబు, పులపర్తి రాంబాబు పాల్గొన్నారు.

వికలాంగునికి ట్రై సైకిల్ అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని పంజా సెంటర్‌కు చెందిన వికలాంగుడు పోతుమూడి రాజు మెయిన్ రోడ్డులో మొక్కజొన్న పొత్తుల వ్యాపారం చేస్తుంటాడు. అతనిని రోజూ పక్క వ్యాపారస్తులు తీసుకొచ్చి మరలా సాయంత్రం ఇంటికి తీసుకెళ్తారు. ఈ నేపథ్యంలో కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు మూడు చక్రాల సైకిల్‌ను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు సారె..

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం మావుళ్లమ్మకు విజయవాడ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు చెన్నా జనార్ధనరావు, కె.వెంకటరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు సారే అందజేశారు. సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సంప్రదాయ బద్ధంగా అమ్మవారికి సారె పెట్టారు. ఆలయ ఇఒ యర్రంశెట్టి భద్రాజీ, ఆలయ అర్చకులు ఊరేగింపునకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి అమ్మవారికి సారె పెట్టారు. అనంతరం విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థాన సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మానేపల్లి నాగన్న బాబు, పాలకవర్గ సభ్యులు రామాయణం సత్యనారాయణ, ముత్యాల రామారావు, భాగ్యలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కేశవరం వంతెన నిర్మించాలి

ప్రజాశక్తి - గణపవరం

ఉండి కాలువపై కేశవరం వంతెన నిర్మాణం వెంటనే చేపట్టాలని సిపిఎం జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. కేశవరంలో స్థానిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రజల వద్ద విరాళాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేశవరం వంతెన కూలిపోయి సంవత్సరాల గడుస్తున్నా ప్రభుత్వం కొత్త వంతెన నిర్మాణానికి ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం దారుణమని అన్నారు. వంతెన పడిపోయిన స్థానంలో బేయిలి వంతెన నిర్మాణం చేసినా ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే నూతనంగా వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పి.నరసింహమూర్తి, మండల కమిటీ నాయకులు ఎన్.రామకృష్ణ, పి.వెంకటలక్ష్మి, జె.వెంకటలక్ష్మి, పి.ఓంకార్ పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - ఆకివీడు

విద్యార్థి స్థాయిలో ఉన్న ప్రతి ఒక్కరూ తమ జీవితానికి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని, ఆ లక్ష్యం దిశగా కృషి చేయాలని జెడ్‌పి హైస్కూల్ ఫిజిక్స్ లెక్చరర్ ముత్యాల వెంకటస్వామి అన్నారు. విద్యా వికాస్ జూనియర్ కళాశాల వార్షికోత్సవం సోమవారం స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా వెంకటస్వామి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కృషి పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం దానంతట అదే దరి చేరుతుందన్నారు. కళాశాల అధ్యాపకులు ఆ దిశగా చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ చోప్పర్ల బలరాం బాబు మాట్లాడారు. అనంతరం గత రెండు సంవత్సరాలుగా వార్షిక పరీక్షలలో ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

దుర్గమ్మ మకర తోరణానికి 700 గ్రాములు వెండి అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని 23వ వార్డు కొత్తకాలనీలో నిర్మించిన శ్రీ వీర దుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి వెండి మకర తోరణం చేయించేందుకు సినీ నిర్మాత గవర ఉదయ శ్రీనివాస్ (బన్నీ వాసు) అవసరమైన 700 గ్రాముల వెండిని అందజేశారు. ఈ వెండిని బన్నీ వాసు తరపున శిద్దిరెడ్డి అప్పారావు, తులా రామలింగేశ్వర రావు, శిడగం సురేంద్ర ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సెప్టెంబర్ రెండో తేదీన పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలకు ఈ కాలనీకి వచ్చిన సందర్భంలో ఆలయం నిర్మాణ దశలో ఉన్న సమయంలో ఆలయ కమిటీ సభ్యులు, వార్డు జనసైనికులు అమ్మవారి ఆలయానికి తోడ్పాటు అందించాలని కోరగా వెంటనే స్పందించి అమ్మవారికి మకర తోరణం, హస్తాలు మొదలగు ఆభరణాలకు అవసరమైన 700 గ్రాములు వెండిని పంపించడం చాలా సంతోషం కలిగిందన్నారు. కార్యక్రమంలో బిట్టా లక్ష్మీనారాయణ, విన్నకోట గోపి, పినిశెట్టి శ్రీనివాస్, అలుగు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో బిసి గణన చేపట్టాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

జాతీయస్థాయిలో బిసి జనాభా లెక్కింపు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని జాతీయ బిసి ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు గూడూరి వెంకటేశ్వరరావు కోరారు. పాలకొల్లు బిసి కమ్యూనిటీ హాల్ వద్ద జరిగిన జిల్లా బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ నియోజకవర్గాల మహిళ, యువత, జనరల్ విభాగాల కార్యవర్గాలను ఆయన ప్రకటించారు. రాష్ట్రంలో బిసిల సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ అభివృద్ధికి అందరూ సమైక్యంగా పోరాడాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బిసిల జనాభా నిష్పత్తిని బట్టి అన్ని పార్టీలూ సీట్లు కేటాయించాలన్నారు. సమావేశంలో పాలకొల్లు నియోజకవర్గ అధ్యక్షులు గానుబోయిన దుర్గారావు, మండల అధ్యక్షుడు కుక్కల సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షులు సునీల్ కుమార్, నియోజకవర్గ గౌరవాధ్యక్షులు బి.గంగాధర్, యువత పాల్గొన్నారు.

KANAKADURGA
FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : -1st ఫ్లోర్, జెడ్‌ల్యాబ్స్ ఎదురు, ఆర్ఆర్‌పేట, ఏలూరు.
- ఏలూరురోడ్డు, లక్ష్మిథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
-1st ఫ్లోర్, సుబ్బారావుపేట,కమల హాస్పిటల్స్ ఎదురు, తాడేపల్లిగూడెం
-1st ఫ్లోర్, వెంకన్నప్లాజా, కప్పల వెంకన్న సెంటర్, వేల్పూరు రోడ్డు, తణుకు.
-1st ఫ్లోర్, కన్నపురం రోడ్డు, వాసవి కన్యకా పరమేశ్వరి గుడి పక్కన, కొయ్యలగూడెం.
-1st ఫ్లోర్, బస్టాండ్ ఎదురు, దేవరపల్లి
- గ్రౌండ్‌ఫ్లోర్,అక్షరానంద స్కూల్ ఎదురు, ధర్మాజీగూడెం-534462, ఏలూరు జిల్లా.
- 16-225, ఫస్ట్‌ఫ్లోర్, పాతబస్టాండ్ దగ్గర, జివిమాల్ సూపర్ మార్కెట్, మెయిన్‌రోడ్డు, చింతలపూడి. ఫోన్ :9492934845
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 24-02-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 2600.0 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
ELURU AREA CELL NO- 80088 12798